# చిత్రం విచిత్రం

రచన;
శ్రీ దగ్గుపాటి.

చిత్రాలు (ఫోటో. క్యాలండర్, ప్రేమ యిత్యాదులు) లేని యిల్లంటూ వుందా? అటువంటి యింటిని నేనింతవరకు చూసి ఎరుగను. యే యింటికి వెళ్ళినా యెవరింట్లో చూసినా ఏమో చిత్రాలు (ఫ్రేములు) వుంటాయి, కనీసం యేదో ఒక క్యాలండరన్నా గోడమేకకు వ్రేలాడుతుంటుంది. దైవభక్తికలవారు దేవుళ్ళచిత్రాలు పెట్టుకుంటారు. రాజకీయాల్లో ప్రవేశమున్నవారు రాజకీయ నాయకుల చిత్రాలు పెట్టుకుంటారు. యిక డైరక్టర్ల సంగతి సరేసరి. సినిమా క్యాలండర్లు అర్ధనగ్న హాలీవుడ్ మోడల్ క్యాలండర్లు పెట్టుకుంటారు. యిక నాలాంటి వ్రాత పిచ్చివాళ్ళు వారికి తోచిన చిత్రాలు పెట్టుకుంటారనుకోండి.

ఎవరిమీద ఎటువంటి అభిమానంలేని అయిదవ జాతికు చేరినవారు స్వాభిమానంతో కనీసం తమసొంత చిత్రాన్నైనా (ఫోటో) గోడకు కట్టబెట్టుకుంటారు. ఇలా యిళ్ళల్లో పెట్టుకూనుండే చిత్రాన్నిబట్టి ఆయా వ్యక్తుల అభిరుచుల్ని అభిమానాన్ని యిట్టే అంచనా వేయవచ్చు.

చిత్రాల పేరుతో చెత్తగా వారిని వీరిని విమర్శించటం నా అభిమతం కాదు. నన్ను నేను విమర్శించుకోవటంలోనే ఎక్కువ తృప్తిపడుతుంటాను నామటుకు నేను. యిక అసలు విషయానికొస్తాను; నా రూంగోడకు నేను రాసుకొనే డ్రాయిరు బల్లకెదురుగా తలయెత్తితే నాకళ్ళకు సూటిగా కనబడేవిధంగా అహింసామూర్తి గౌతబుద్ధుడి పెద్దచిత్రాన్ని అందంగా కట్టి వుంచాను. ఆ చిత్రంలో బుద్ధభగవానుడు తన భుజాలమీద ఒక కుంటిమేక నెత్తుకొని విశాలమైన కన్నులతో ఆ కన్నుల్లో కరుణారస కాంతుల్ని వెదజల్లుతూ జీవహింస కూడదని నచ్చజెప్పటానికి బింబిసార మహారాజు యాగానికి వెళ్తున్నట్టుగా సాక్షాత్కరిస్తున్నాడు.

ఆనాటిరాత్రి నా వ్రాత బల్లముందు కూర్చొని ఒక బుల్లికథ వ్రాయటానికి పూనుకున్నాను. ఎంత ఆలోచించినా కథకు కావాల్సిన సరైన ప్లాటుదొరకక పాడు బుఱ్ఱను తిట్టుకుంటూ తలపైకి యెత్తి నాయెదురు గోడకున్న బుద్ధుడి చిత్రాన్ని చూశాను. ఫ్రేము వెనుకనుంచి దొంగలా ఒక బల్లి హఠాత్తుగా యివతలకొచ్చి పాపం లైటువెలుగులో గోడమీదున్న ఒక పురుగును పట్టి గుటుక్కున మ్రింగి చటుక్కున మరల గౌతముడి చిత్రం వెనక్కు వెళ్ళిదాక్కుంది. కథ యెటన్నా మనసు బల్లిమీదకు పోయింది, అది చేసిన అఘాయిత్యానికి నాలోరక్తం పొంగి దాన్ని నిలువునా చంపేయాలనిపించింది. అహింసామూర్తి చిత్రం నీడలో దాక్కొని ఎంత పెద్ద హింసకు పాల్పడిందో చూశారా, ఆ బల్లి! దానికెంత ధైర్యం, ఎంత పొగరు.

ఈ విధంగా ఆలోచిస్తూ నా మెదడు హీటెక్కి పాడుబల్లిని ఒకే దెబ్బతో క్లోస్ చేయాలని భావించి కుర్చీలోనుంచి లేచాను.

లేచి చిత్రంలోని భగవానుడి ముఖారవిందాన్ని ఒకసారి తిలకించాను.

ఆయన ముఖవర్చస్సులో ఎటువంటి మార్పులేదు. పైగా ఆ మహాజ్ఞాని నన్ను చూసి పరిహసిస్తున్నట్టుగా నవ్వుతున్నట్టుగా అనిపించింది.

'ఆ అల్పబల్లిమీద నీ కెందుకింత కోపం? అది జ్ఞానహీన జీవి. పైగా దాని కాపురుగులే ఆహారం. ప్రకృతి సహజంగా దానికి కల్పించిన జీవన రీతి అది, దానిసంగతి అలా వదిలేయ్, అన్ని తెలిసిన మనుషులు జ్ఞాన అజ్ఞానాల్ని తెలుసుకోగల మీరంతా యీనాడు మహానుభావుల పేర్లు చెప్పుకుంటూ వారి నామాలు జపిస్తూ తెరమరుగున చేసేదేమిటి? తెలిసి కూడ ఎదుటివార్ని ఎందర్ని జీవహింసచేయటం లేదు మీరు? స్టేజీలమీద నిలబడి ఎన్నెన్ని పవిత్రవాగ్దానాలు చేయటంలేదు? స్టేజీలు దిగి యెన్నెన్ని అపవిత్రపనులకు పాల్పడటంలేదు! బల్లికరకు తన కడుపు నిండిందంటె పురుగుల్ని తినే ప్రయత్నం మానుకొని తృప్తిగా వెళ్లిపోతుంది. మళ్ళీ ఆకలైనప్పుడు గాని, తిరిగి వేటకు బయలుదేరదు. మీరంతా యిప్పుడిలా కాదు. రాజకీయంగా గానీ, వ్యాపారపరంగా గానీ, యితరత్రా అడ్డదారుల్లోగానీ పురుగుల్లాంటి పేద ప్రజానీకాన్ని, మీ ఆశలు తీరినా, మీ బొక్కసాలు నిండినా తృప్తి అనేది లేకుండా ఇంకా, యింకా అంటూ దోచుకుంటూ సహ సోదరహింస చేయటం లేదూ? పిచ్చివాడా! వృథాప్రయాసమాని దానిమానాన దాన్ని వదిలి వెళ్ళి కాగితాలమీద నీ పిచ్చిగీత లేమిటో నువ్వు గీసుకో అని మరెవరో గట్టిగా నన్ను హేళనచేసినట్టుగా తోచింది. సిగ్గుతో సరాసరి వచ్చి నా కుర్చీలో కూలబడ్డాను. యింకేం కథరాయను 'మన కంటే బల్లి నయమా?'

నా తల తిరిగి పోసాగింది.